పల్లెల్లో పేట్రేగుతున్న మట్టి మాఫియా

- జోరుగా ఇసుక, మట్టి అక్రమరవాణా
- రూ.లక్షలు జేబులు నింపుకుంటున్న వైనం
- పాపపు సొమ్ములో అధికారులకూ వాటాలు

అల్లూరు(వీరులపాడు): ఓ వైపు ఇసుక మాఫియా.. మరోవైపు మట్టి మాఫియా..వీరులపాడు మండలంలో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. సహజ వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్నారు. చెరువులను తవ్వేస్తూ.. గ్రావెల్‌ను విక్రయిస్తూ లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. పచ్చదనాన్ని నాశనం చేస్తూ.. నేలతల్లికి తూట్లు పొడుస్తున్నా అధికారులది ప్రేక్షక పాత్రే అయ్యింది. కళ్లెదుటే అవినీతి సాగుతున్నా...అక్రమార్కులు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నా అధికారులు తమకేమి కనిపించనట్లు వ్యవహరిస్తుండటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. తిలా పాపం.. తలా పిడికెడు అన్నట్లు అక్రమార్కుల పాపాల్లో పలువురు అధికారులు సైతం తమవంతు పాలుపంచుకుంటున్నారు.

యథేచ్ఛగా అక్రమరవాణా..

నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని కృష్ణా, మునేటి పరివాహక గ్రామాల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతుంటే, పచ్చని పల్లెల్లో మట్టి మాఫియా పేట్రేగిపోతుంది. అధికారుల అలసత్వం, అవినీతిని ఆసరా చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఇసుక మాఫియాకు ఇప్పుడు మట్టిమాఫియా కూడా తోడుకావడంతో ప్రకృతి సంపద హారతి కర్పూరంలా కరిగిపోతోంది. ముఖ్యంగా వీరులపాడు మండలంలోని అల్లూరు గ్రామ శివారులోని తిమ్మాపురం చెరువు నుంచి అక్రమార్కులు



అల్లూరు-తిమ్మాపురం చెరువులో ట్రాక్టర్‌లోకి మట్టిని నింపుతున్న ప్రొక్లెయిన్

మూడు రోజులుగా ఇష్టారీతిన మట్టిని తరలిస్తుండటమే ఇందుకు నిదర్శనం.

తెలంగాణకు సైతం తరలింపు..

అల్లూరు శివారు తిమ్మాపురం చెరువులోని గ్రావెల్ (ఎర్రమట్టి) విక్రయిస్తూ పలువురు అక్రమార్కులు లక్షలు గడిస్తున్నారు. గ్రామంలోని చెరువులో ప్రొక్లెయిన్ వంటి భారీ యంత్రాలను ఉపయోగించి రాత్రీపగలు అనే తేడా లేకుండా రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్ల మట్టిని తరలిస్తున్నారు. ఈ మట్టిని కంచికచర్ల, వీరులపాడు మండలాలతోపాటు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెంతో చుట్టు ప్రక్కల మండలాలకు సైతం తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. ఒక్కో ట్రక్కు మట్టిని రూ.1,500 నుంచి రూ.2వేల వరకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

చెరువులో భారీ గోతులు..

చెరువు మట్టి అక్రమ తవ్వకాల కారణంగా చెరువులో



చెరువు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

15 నుంచి 20 అడుగుల మేర భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికే వర్షాలు కురిసిన సమయంలో నీటిని తాగేందుకు చెరువులోకి దిగిన మూగజీవాలు ఆ గోతుల్లో పడి మృత్యువాత పడుతున్నాయని పలువురు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈ చెరువు గోతుల్లో పడి మనుషులు, పశువులు మృత్యువాత పడిన ఘటనలను గుర్తుచేస్తున్నారు. ఇక ఈ మట్టి తరలింపుతో ఏర్పడే భారీ గోతుల కారణంగా భవిష్యత్‌లో ఎన్ని ప్రమాదాలు చోటుచేసుకుంటాయోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అక్రమార్కుల ధన దాహానికి అడ్డే లేకుండా పోయిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

అధికారులకూ వాటాలు..

మట్టిరవాణా ద్వారా సంపాదిస్తున్న సొమ్ములో అక్రమార్కులు, సంబంధిత అధికారులు కూడా వాటా ఇస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. అందుకే అధికారులు కిమ్మనకుండా ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండానే చెరువు నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాల్లో మట్టి తోలుతున్నా అధికారులు పట్టించుకోకపోవడానికి ఆపాపపు సొమ్ములో వాటాలు ముట్టడమేననే విమర్శలు ఉన్నాయి. ఇలా తిమ్మాపురం చెరువు నుంచి మట్టి అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయటంతోపాటు మట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్నవారిపై, మామూళ్ల మత్తులో జోగుతూ అక్రమార్కులకు సహకరిస్తున్న అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

అల్లూరు శివారు తిమ్మాపురం చెరువు నుంచి మట్టి తవ్వకాలకు ఎవ్వరికీ అనుమతులు లేవు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తరలించడం చట్టరీత్యా నేరం. మట్టి తరలించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

టి.రాజేష్, ఇరిగేషన్ ఏఈ

క్లుప్తంగా

విద్యార్థినిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే



నందిగామటౌన్: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు 573మార్కులు సాధించిన 19వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు సగ్గుర్తి డేవిడ్ కుమార్తె ప్రణతిని మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అభినందించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఆదివారం విద్యార్థిని ప్రణతి కలిసింది. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు విద్యార్థిని ప్రణతిని అభినందించారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మంచి భవిష్యత్ ఉంటుందని, బాగా చదివించాలని బాలిక తల్లిదండ్రులకు సూచించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేవినేనిని కలిసిన శ్రీనివాసరావు



జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన పెంటి శ్రీనివాసరావు ఆదివారం విజయవాడలో ఆపార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్‌లో మళ్లీ వైఎస్ జగనన్న నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు మరింత కృషిచేయాలని అవినాష్ సూచించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

300 మందికి వైద్యపరీక్షలు

ముక్త్యాల(జగ్గయ్యపేట):గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోహెన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 300మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ మురళీధర్, కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): గ్రంథాలయాల్లో ఈనెల 28వతేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు కొణకంచి గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పుస్తకపఠనం, పుస్తక సమీక్ష, కథలు చదివించడం, డ్రాయింగ్, క్రాఫ్ట్ వర్క్, డాన్స్, యోగా, ఆటపాటలు నేర్పిస్తామని వివరించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను గ్రంథాలయాలకు పంపించాలని ఆయన కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నందిగామరూరల్: చెడునడత కలిగిన వారు తమ తీరు మార్చుకుని నడుచుకోవాలని సీఐ వైవీఎల్ నాయుడు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గత కేసులకు సంబంధించి సమస్యాత్మక వివాదాలతో సంబంధం ఉన్నవారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ముఖ్యంగా రౌడీషీటర్ల అసాంఘిక కార్యక్రమాలు, వివాదాలు, ఘర్షణలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని వివరించారు. అనంతరం వివాదాలు, ఘర్షణలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఘటనలలో పాల్గొనబోమంటూ రౌడీషీటర్లచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అభిమన్యు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

నందిగామటౌన్: పట్టణంలోని నెహ్రూనగర్‌లో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష అర్చనలు, నిత్య హోమాది క్రతువులు శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం కన్నుల పండువగా సహస్రదీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు యోగానందాచార్యులు, శ్రీనివాస అనంతాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోతురాజుకు పాలపొంగళ్లు సమర్పణ

నందిగామ రూరల్: పట్టణ సమీపంలోని అనాసాగరం గ్రామ మునేటి ఒడ్డున వేంచేసియున్న పోతురాజుకు రైతులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత పోతురాజుకు ప్రత్యేక పూజలు చేసి పాలపొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా నీటిసంఘం అధ్యక్షుడు చలమల కృష్ణ మాట్లాడుతూ ఏటా పోతురాజుకు పాలపొంగళ్లు సమర్పించటం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. యేచూరి రాము, శ్రీనివాసాచారి, లక్ష్మీనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



పెనుగంచిప్రోలు: గ్రామంలోని వచ్చే ప్రతి వాహనాన్ని ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ ఆధ్వర్యంలో పోలీసుసిబ్బంది ఆదివారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్లు, ద్విచక్రవాహనాలు, బస్సులు అన్నిరకాల వాహనాలను తనిఖీ చేశారు. మే 2న ప్రధాని నరేంద్రమోడీ అమరావతి పర్యటనను నేపథ్యంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



బోనం సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులకు ఆలయం వారు మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



ఆలయం చుట్టూ సాగుతున్న అమ్మవారి రథోత్సవం

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు



అల్పాహారం పంపిణీ చేస్తున్న వాసవీ సేవాసమితి సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో బాటసారులకు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్విమ్మర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు పిన్నెల్లి పాండురంగారావు, జాతీయ బీసీ సంఘం నాయకులు పచ్చిపాల నాగేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధులు మధు, తుపాకుల పిచ్చయ్య, లక్ష్మీనారాయణ, చిలుకూరి హరికృష్ణ, కొఠారు రామారావు, నర్రా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాసవీ సేవాసమితి వారి ఆధ్వర్యంలో..

పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో 100 రోజుల చలివేంద్రం వద్ద దివంగత సముద్రాల లక్ష్మీగోపాలం వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యులు అల్పాహారం పంపిణీ చేశారు. సేవాసమితి ప్రతినిధులు యన్నాకుల రాంబాబు, పేరూరి నరసింహారావు, పెనుగొండ రామకృష్ణ, స్వామి కృష్ణమూర్తి, చౌట రమేష్, సూరె రాము పాల్గొన్నారు.

నరకప్రాయం.. ఈ రోడ్లపై ప్రయాణం

- అడుగడుగునా గోతులతో ప్రమాదాలు
- అవస్థల్లో వాహనచోదకులు, రైతులు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి- నందలూరు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి రాగానే రోడ్లన్నీ అభివృద్ధి చేసి అద్దంలా ఉంచుతామన్న కూటమి ప్రభుత్వం నేటికి రోడ్ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో జనానికి అవస్థలు తప్పడం లేదు.

తరచూ ప్రమాదాలు..

కంచికచర్ల మండలం గండేపల్లి నుంచి వీరులపాడు మండలం నందలూరు ఆర్ అండ్ బీ రోడ్డు పూర్తిగా రాళ్లు లేచి గోతులు ఏర్పడటంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై నియోజకవర్గ కేంద్రమైన నందిగామ నుంచి వీరులపాడు మండలం నందలూరు, తాటిగుమ్మి, గోకరాజుపల్లి మీదుగా వెల్లంకి, కొణతానపల్లి, పల్లంపల్లి మీదుగా తెలంగాణ రాష్ట్రం చిలుకూరు, మధిర వరకు నిత్యం వాహనదారులు ప్రయాణిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ రోడ్డు అభివృద్ధికి కూటమి ప్రభుత్వంగా ఏడాదిగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణాలు చేయాలంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు. ఇక పాదచారులు అయితే మాత్రం రోడ్డుపై నడవలేక అక్కడక్కడా ఆగుతూ ప్రయాణం సాగిస్తున్నారు.



గండేపల్లి - నందలూరు రోడ్డుపై మొనతేలిన కంకర

పల్టీ కొడుతున్న వాహనాలు..

ఈ రోడ్డు సమీపంలో పొలాలున్న రైతులు వారి పంట ఉత్పత్తులను ఇళ్లకు చేరవేసేటప్పుడు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు పల్టీకొట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అదేవిధంగా మండలంలోని కంచికచర్ల నుంచి బత్తినపాడు మీదుగా మోగులూరు ఆర్ అండ్‌బీ రోడ్డు కూడా రాళ్లులేచి అధ్వాన్నంగా మారింది. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రోడ్లపై బస్సుల్లో వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

వర్షాకాలంలో సాగని ప్రయాణం...

రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో వర్షాకాలంలో ఈ రోడ్లపై వర్షపు నీరు నిలబడి ఉంటుంది. ఎక్కడ ఏ గోయి ఉంటుందో అర్థంకాని పరిస్థితుల్లో వాహనచోదకులు ఆయా గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ రోడ్లపై



అధ్వానంగా ఉన్న కంచికచర్ల-మోగులూరు రోడ్డు

ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆయా రోడ్ల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కంచికచర్ల మండల ప్రజలు కోరుతున్నారు.

నిధులు రాగానే అభివృద్ధి చేస్తాం...

గండేపల్లి-నందలూరు, కంచికచర్ల-మోగులూరు రోడ్ల అభివృద్ధికి ఇప్పటికే అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు మంజూరుకాగానే ఈరోడ్లను అభివృద్ధి చేస్తాం.

శశిభూషణ్, నందిగామ ఆర్‌అండ్‌బీ డీఈ

ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే హడల్...



నందలూరు నుంచి నందిగామ వెళ్లేందుకు ఈ రోడ్డులో ప్రయాణమంటేనే హడలిపోవాల్సిన పరిస్థితి. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఒక్కోసారి కోర్టు విధులకు కూడా హాజరుకాలేకపోతున్నా. రోడ్డు అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

తాడేపల్లి కాంతారావు, న్యాయవాది, నందలూరు

రోడ్లను అభివృద్ధి చేయాలి...



మోగులూరు నుంచి ప్రజలు నిత్యం కంచికచర్ల, నందిగామకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈరోడ్డులో గోతులు ఏర్పడటంతో రాకపోకలకు జనం అవస్థలుపడుతున్నారు. రోడ్లను అభివృద్ధికి కూటమి నాయకులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇకనైనా స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలి.

బండి మల్లికార్జునరావు, వైస్ ఎంపీపీ, మోగులూరు

ఇందిరా కాలనీలో కార్డన్ సెర్చ్

17 బైక్‌లు, రెండు ఆటోలు, ఒక కారు స్వాధీనం

కంచికచర్ల : సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినమైన చర్యలు తీసుకుని వారిని జైలుకు పంపుతామని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ చవాన్‌దేవ్ హెచ్చరించారు. కంచికచర్ల ఇందిరాకాలనీలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్డన్ సెర్చ్‌లో నందిగామ సబ్ డివిజన్ పరిధిలోని మొత్తం ఎనిమిది మంది ఎస్‌ఐలు, 80మంది పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు. ఇందిరాకాలనీలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇళ్లలో అనుమానస్పద వస్తువులు ఉన్నయోమోనని అణువణువూ పరిశీలించారు. ఆయా ఇళ్లలో నివసించే వ్యక్తులు ఆధార్ కార్డులను పరిశీలించారు. ఎంతకాలం నుంచి అక్కడ నివసిస్తున్నారు.. ఇళ్ల పక్కల ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చారా? అని కాలనీవాసులను ఆరా తీశారు. వేలిముద్రల తనిఖీ ద్వారా పాతనేరస్తులు ఏమైనా ఇక్కడ తలదాచుకుంటున్నారేమోనని పరిశీలించారు. ఆయా వాహనాల ధ్రువీకరణపత్రాలను పరిశీలించి, సరైన ధ్రువీకరణపత్రాలు లేని 27బైక్‌లు, రెండు ఆటోలు, ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సీఐ చవాన్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ చర్యలలో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు.



కంచికచర్ల ఇందిరాకాలనీ వాసుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న సీఐ చవాన్‌దేవ్, సబ్‌డివిజన్ పోలీసులు

నేత్రపర్వంగా సాగిన సంప్రదాయ నృత్యోత్సవం

విజయవాడ కల్చరల్: అంతర్జాతీయ నృత్యదినోత్సవం సందర్భంగా దృశ్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నాట్యాచార్యులు, చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. నగరానికి చెందిన నాట్యాచార్యులు గోనుగుంట్ల శైలశ్రీ నృత్యనిలయం, పద్మశ్రీ హేమంత్ భారతీయ నృత్యనిలయం, డాక్టర్ ఉషామాధవి సిరిమువ్వ నృత్యనికేతన్, డాక్టర్ సీహెచ్ అజయ్‌కుమార్ హంసధ్వని కూచిపూడి నృత్యాలయం, సంతోష్ శ్రీ శారదా నృత్యపీఠం, యల్లా జోస్యుల అనూరాధ శారదా నృత్యనిలయం, యువ నాట్యకళాకారులు ఎమ్ లేఖ్యాభరణి, సీ సిరి శృతి సమన్విలు తమ బృందాలతో 70 మంది కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా నాట్యాచార్యులు వేదాంతం పాండురంగశర్మ, గోనుగుంట్ల సత్యానందినిలను ఆత్మీయంగా సత్కరించారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

దేశ గౌరవాన్ని చాటుతున్న నృత్యాలు

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హ్యాపీ రిసార్ట్స్ అధినేత అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ నాట్యాచార్యులు సంప్రదాయ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథాకళి, ఒడిస్సీ నృత్యాలు మన దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెపుతున్నట్లు తెలిపారు. దృశ్యవేదిక సభ్యులు హెచ్‌వీఆర్ ప్రసాద్, దొంతాల ప్రకాష్, నరేన్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బత్తుల రూపాశ్రీ నిర్వహించారు.

వరుస చోరీలతో జనం బెంబేలు



హుండీ అపహరణకు గురైన ముండ్లపాడు విఘ్నేశ్వరాలయం

పెనుగంచిప్రోలు: వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా నిలిపి ఉంచిన లారీల్లోని బ్యాటరీలు, జాకీ, టేప్‌రికార్డర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి అపహరించారు. అదే విధంగా రెండురోజుల కిందట ముండ్లపాడు పెట్రోల్ బంక్ సమీపంలో ఓ మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లగా, ముండ్లపాడు విఘ్నేశ్వరస్వామి ఆలయంలో హుండీని సైతం అపహరించారు. అదేవిధంగా వారం రోజుల కిందట పెనుగంచిప్రోలు తుఫాన్ కాలనీలో రెండుబైక్‌లు అపహరణకు గురయ్యాయి. ఇలా పెనుగంచిప్రోలు మండలంలో వరుసగా దొంగతనాలు చోటుచేసుకుంటుండటంపై మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు తగు నిఘా ఏర్పాటు చేసి చోరీలకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.